# మంచికి మరో జన్మ

పి. పాపిరెడ్డి



ఆకాశం నీలిరంగుతో అలికి చుక్కలతో ముగ్గులు పెట్టినట్లుగా లేదు. పండు వెన్నెల లాంటి పసిడి నవ్వులు వెదజల్లే నిండు జాబిలి లేదు. ఫ్యాక్టరీలు మూసేసి లాకౌట్లు ప్రకటించిన యజమానుల్లా నల్లటి మేఘాలు ఆకాశంనిండా పరచుకొని ఉన్నాయి. దూరంగా నగరంలోని విద్యుద్దీపాలు వరుసగా బారులుతీరి హర్తాళ్ జరుపుతున్న నక్షత్రాల్లా ఉన్నాయి. అశాంతితో అందోళన పడుతున్న లోకంలా ఆకాశం ఒక్కొక్క చినుకును రాల్చుతూ ఉంది. ఆ వాతావరణానికి ప్రతిబింబంలా అతని మానసాకాశం కూడా ఆలోచనా మేఘాలతో అల్లకల్లోలంగా ఉంది. ఆ ఆలోచనల బరువు భరించలేనట్లు అతను వెనక్కు వాలి ఇసుకతిన్నెమీద వెల్లకిలా పడుకున్నాడు. అతని ఆలోచనా స్రవంతి గతంలోకి తిరిగింది.

ఆస్తు లమ్ముకొని కొందరు డిగ్రీలు తెచ్చుకుంటే డిగ్రీల నమ్ముకొని కొందరు ఆస్తులు గడిస్తారు. అందులో మొదటి తరగతికి చెందినవాడు ధనిక్ లాల్. అతను పట్టా పొందేసరికి తనకున్న మూడెకరాల మాగాణికి తిలోదకాలివ్వకోవలసి వచ్చింది. అయినా అతను బాధపడలేదు. మిగిలిన మూడెకరాల మెట్టా, బి. ఏ. పట్టా, తనొక్కడి పొట్ట నింపలేకపోతుందా అని అనుకున్నాడు.

కనిపించిన ప్రతి ఉద్యోగానికీ దరఖాస్తు పెట్టాడు. పిలిచిన ప్రతి చోటికి వెళ్ళాడు. ఈ రెండు సంవత్సరాల ఉద్యోగాన్వేషణలో లోకజ్ఞానం పుష్టిగా లభించింది గాని ఉద్యోగం మాత్రం దొరకలేదు. పైగా ఇంటర్వ్యూల నాటకాలలో అతిధి నటునిగా అభినయించినందుకు, సంసారిక ఖర్చులకు వెరసి 6 వేల అప్పయింది. వర్షాభావంవల్ల మెట్టా, పొడుగుచేతుల ప్రాపకలోపంవల్ల పట్టా నిష్ప్రయోజనమైనదని గుర్తించేసరికి చాలాకాలం పట్టింది. ఇక యేమిటా అని భవిష్యత్‌వైపు దృష్టి సారించాడు, ముక్తికోసం పరితపించే భక్తునిలా. ఉండుండి అతనికొక ఆలోచన తట్టింది. మెట్ట అమ్మి అప్పు తీర్చి మిగిలిన దానితో వ్యాపారం చేస్తే స్వతంత్రంగా గడిచిపోదా జీవితం అనుకున్నాడు.

అలా ధనిక్ చీకటినుండి వెలుగు వైపు వురికే శలభంలా నిరుద్యోగం నుండి వ్యాపారంలోకి దూకడం జరిగింది. తక్కువ పెట్టుబడితో తనున్న టౌనులో వ్యాపారం లాభించదు. ఏదైనా మంచి పల్లెటూరును ఎన్నుకోవడం మంచిదని అనుకున్నాడు.

వయ్యారంగా ప్రవహించే గోదావరి వంపులో ఉన్నతమైన చల్లని సైకత ప్రదేశంలో ఉన్న మదనాపురం చల్లని తల్లి మెత్తని గుండెలపై ఆడుకొనే పసిబిడ్డలా ఉంది అతని మనసును ఆకట్టుకొంది.

రచ్చ దగ్గర కూర్చొన్న సర్పంచ్ రామస్వామి చౌదరిని కలుసుకొని విషయాన్ని వివరించగా అతను ఆనందపడ్డాడు.

'విద్యావంతులైన మీలాంటి యువకులు గ్రామాలకు వస్తే వ్యాపారమే కాదు, వ్యవసాయం, సంగీతం, సాహిత్యం, ఆర్థిక వనరులు అన్నీ అభివృద్ధి చెంది పల్లెలు పట్నాలై పోతాయి. అదే నా ధ్యేయం, ఆశయం కూడా' ఇది సభ కాదని గుర్తొచ్చి ఆపుజేశాడు చౌదరి.

'గోదావరి బేసిన్‌లో నూనె ఉందంటున్నారు. అదే జరిగితే మా పల్లెకు మంచి భవిష్యత్తు ఉన్నట్లే' అన్నాడు ప్రక్కనున్న పెద్దాయన.

'పల్లెతోపాటు నీవు కూడా పైకి వస్తావు నాయనా, పర్వాలేదు' ఆశీర్వదించినట్టుగా అన్నాడొక వృద్ధుడు. వారి మాటల్లో తన భవిష్యత్తు హరివిల్లులా కన్పించి ముగ్ధుడై వినయంగా తల వొంచుతున్నాడు ధనిక్.

'మా సరపంగారు చల్లగా చూస్తే మా పల్లెకంటే ముందే తమరు పైకి వెళ్తారులెండి' అన్నాడు గోడకానుకొని కూర్చున్న మల్లేశు. ఉలిక్కిపడి తల ఎత్తాడు ధనిక్.

'పంచాయితీలు వచ్చి పాతికేండ్లు అయినా సర్పంచ్ అనేది రాకపోయెనే. ఇక పల్లెలు పైకి ఎట్లావస్తాయిరా మల్లేశు'

అన్నాడు చౌదరిగారు కళ్ళల్లో ఎర్రజీరతో, మోము మీద దరహాసంతో.

'ఇటువంటి అమాయకుల నోటబడి శబ్దాలు తమ అర్థాలనే మార్చుకుంటు న్నాయి,' ధనిక్ నవ్వుతూ అన్నాడు.

పరంధామయ్య ముక్కుమీద వేలేసు కొని 'వీడాండి అమాయకుడు. మొన్న ఎలెక్షన్లో నా ఓటు మీకేనంటూ ఇరుపక్షాల నుండి చెరో వంద వసూలుచేశాడు. వాడి మాటలు మీద విశ్వాసం కలుగక ఆఖరుకు ఓటు వేయకుండా ఉండే షర్తుమీద ఇరు వర్గాల వారు మరో వంద యిచ్చి సాగ నంపారు.' అందరు గొల్లున నవ్వారు. వాళ్ళతోపాటు మల్లేశు నవ్వాడు. 'వస్తా నండి' అంటు లేచాడు ధనిక్. 'ఊరికే రావడంకాదోయి, ఒక్కసారే సరుకు, సామగ్రితో రా.' అన్నాడు చౌదరి.

ఒక సుముహూర్తాన పెద్దల సమ క్షంలో దుకాణం తెరిచాడు ధనిక్. క్రమేణా ఒక్కటొక్కటి పెంచుతూ, బట్టలు మందులతోసహా పల్లెటూరి కవసర మయ్యే అన్ని సరుకులతో కల్పతరువులా తయారుచేశాడు.

'సర్పంచ్‌గారు సరుకులన్నీ ఇక్క డనే తెమ్మన్నారండి' అంటూ చౌదరి గారి పాలేరు చెప్పగానే ధనిక్ ఆనంద పడిపోయి అప్పటినుండి అవసరమైన వన్నీ అడగకుండానే పంపించేవాడు. ప్రెసిడెంటు ఖాతా పరపతికి ప్రాణమని క్యాష్ అడక్కుండా శుద్దంగా పద్దు వ్రాసుకొనేవాడు.

అర్ధరాత్రి అర్ధాంగి ప్రసవవేదన చూడలేక పరంధామయ్య, అవసరమైన మందులులేక గోవిందావారి బాధపడుతూ కూర్చుంటే మందులు తెచ్చి అందించిన తన్ను చూచి కృతజ్ఞతావర్షం కురిపించాడు పరంధామయ్య. కాని డబ్బు మాత్రం యివ్వలేదు.

రంగు వెలసిన రాజకీయనేత శేషగిరి. ఒకరోజు అతను ఒక చీరతెచ్చి 'సీతమ్మకు ఇది యాభైకి యిచ్చావట కదోయ్. నాకు మొన్న టౌనులో అరవైకి అంటగట్టారు,' అన్నాడు.

ధనిక్ ఎంతో ఉత్సాహంతో పట్టీ చూపించి తానెంత న్యాయంగా ఉందేది సోదాహరణంగా వివరించాడు.

ధనిక్ వ్యాపారం మీద విశ్వాసం బలంగా కుదిరిన శేషగిరి నాలుగు వందలకు బట్టలు ప్యాక్ చేయించాడు. ఇంతగొప్ప వాన్ని డబ్బు ప్రత్యేకంగా అడగాలనా అనుకుంటూ తాన్లు సర్దుకొంటున్న ధనిక్ సందేహం తీరేటట్లు 'పద్దు వ్రాసుకో వోయి, తర్వాత పంపిస్తా' అన్నాడు సిగిరెట్టు పీకను అవతలకు విసురుతూ, అంతే తేలికగా. పద్దు వ్రాయక తప్ప లేదు.

రాను రాను పరపతి పెరిగింది పద్దులు పెరిగాయి. పైసలు మాత్రం రావడంలేదు. అట్లా అని ధనిక్ అజాగ్రత్తయిన మని షేమీకాదు. మొట్టమొదటనే ఈ విషయం

గట్టిగా ఆలోచించి 'డబ్బు నేడు, అప్పు రేపు,' అని పెద్ద అక్షరాలతో బోర్డేమో కట్టాడు. కాని కాగితాలమీదనే గాని కార్యరూపంలోనికి రాని ప్రభ్యువు ప్కీముల్లా ఆ నినాదం అట్టకు మాత్రమే పరిమితమైపోయింది. పైగా తద్వ్యతిరేక మైన ఆచరణ అమలులోకి వచ్చి 'అప్పు నేడు, డబ్బు రేపు'గా మారింది. రేపుకు రూపులేదన్నట్లు రోజు రోజుకు ఖాతాలు మాత్రం హాంలా పెరిగిపోతున్నాయి. చేతిలోనికి డబ్బు మాత్రం రావడంలేదు. మొట్టమొదట క్యాష్‌బేరం ఎక్కువగా జరిగేది. రానురాను క్యాష్ క్రెడిట్‌లోనికి మారేసరికి ధనిక్ మాత్రం ఎక్కడ తీసుకరాగలడు?

అతను ఖాతా పుస్తకాలు ముందువేసు కొని, బాకిపట్టీ తయారుచేసుకొని ఊరి మీద పడ్డాడు వసూలుకు. ఆ ఊరిలో చౌదరి లాంటి సింహాలున్నాయి. మల్లేశు లాంటి నలిగిన నరులు ఉన్నారు. ఈ నర సింహాల అసలు అవతారం చూచి విస్తు పోయాడు ధనిక్.


చౌదరిగారి దగ్గరకు వెళ్ళి 'తమ పద్దు రెండువేల దాక అయిందండి. డబ్బు సర్దకపోతే ఇబ్బంది అవుతుంది.' అన్నాడు వినయంగా ధనిక్.

చౌదరి మిన్ను విరిగి మీదపడ్డట్లు నవ్వాడు. 'వెనుకటికి ఎవరో అన్నాట్ట! వ్యాపారి దగ్గర 8 రూ. లకు సరుకులు తీసుకొని 4 రూ. అని చెప్పి 2 రూ యిస్తే రూపాయి లాభం ఉంటుందట అని. అది సరే అంత మొత్తం ఎందుకయి ఉంటుంది. అయినా కనుక్కొని చెప్తాలే' అంటూ అవసరమైన పనిఉన్నవాళ్లా ఇంట్లోకి వెళ్ళి మరి రాలేదు. ఆయన వాలకం చూచి ధనిక్ ఒళ్ళంతా చెమటపట్టింది. ఊపిరి ఆడనట్లనిపించి బయటకు వచ్చి గాలి పీల్చుకున్నాడు ధనిక్.

అప్పుసంగతి ఎత్తగానే పరంధా మయ్యకు అంతులేని కోపం వచ్చింది. 'ఎప్పుడంటే అప్పుడెట్లా వస్తుందోయి డబ్బు. అసలు లైసెన్సు లేకుండా మందులు అమ్మకూడదోయ్ ఆ సంగతి తెలుసా?'అంటూ పాయింటు లేవదీశాడు.

'ఆనాటి పరంథామయ్యనా' అంటూ ఆశ్చర్యంగా చూచాడు ధనిక్. అతని పాయింటుకు అభినందనలు తెల్పి 'ఇక లైసెన్సు మందులే కొందురులెండి ఈ డబ్బు మాత్రం రెండు రోజుల్లో తప్పక సర్దండి' అంటూ సమాధానానికి కూడా ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు.

అతి కష్టంమీద దొరికిన శేషగిరిని పట్టుకొని 'ఆ నాలుగు వందలు ఇంత వరకు ఇయ్యకపోతిరే. ఏట్లా చేసేదండి వ్యాపారం.' అన్నాడు ధనిక్. అతను సిగిరెట్టు వెలిగించి తాపీగా నవ్వి 'మన దగ్గర అప్పు అంటే బ్యాంకులో వేసి నట్లేనోయి. అయితే వాళ్ళు అడిగినప్పుడు యిస్తారు. మనము యివ్వం. అంతే తేడా!' అన్నాడు.



'మీకేమో నవ్వులాటగా ఉంది. అవతల నేనివ్వాల్సిన వాళ్ళ గొంతుమీద కూర్చున్నారు' అన్నాడు ధనిక్ కోపంగా.

"వాళ్ళ గొంతుమీద కూర్చుంటే నీవు నా నెత్తిమీద కూర్చో. అప్పు తీరేదాకా ఎత్తుకొని తిప్పుతా' నంటు విసవిసా వెళ్ళిపోయాడు శేషగిరి. ధనిక్‌కు ఏమి చేయాలో తోచలేదు ఖాతాదార్లందరూ కొనేటప్పుడు పెద్ద మనషులే. డబ్బు అడిగితే పెద్దపులులు.

ఆ గ్రామములో సింహాలకంటె నరులే జాస్తి. వాళ్ళు కూడా బ్రతిమాలి బామాలి శక్తికి మించిన అప్పులు చేశారు. నరునికి నారాయణునిలా ఈ నరులకు దరిద్రమే సర్వస్వము ఈ నరసింహాల అవతారం చూసిన ధనిక్ హిరణ్యకశ్యపు

నిలా యుడుసుకొన్నాడు. ప్రహ్లాదునిలా ప్రార్థించాడు. భూదేవిలా బ్రతిమాలాడు. ఆ నృసింహావతారం శాంతించింది గాని వీళ్ళ మాత్రం అవగింజంతైనా అను గ్రహించలేదు.

రోజులాగే ఆ రోజూ వసూలుకు బయలుదేరాడు ధనిక్. తిరిగి తిరిగి కాళ్ళు చచ్చుపడ్డాయేగాని అరచేతికి తడి తగల్లేదు. పాలెంనుండి బయటకు వచ్చే సరికి ఎండ మండిపోతూంది. రోడ్డు మండిపోతూంది.. రోడ్డు ప్రక్క గుబు రుగా పెరిగిన చిల్ల చెట్ల పీడకు చేరి చెమట కారే ముఖాన్ని తుడుచుకుంటూ నిల బడ్డాడు ధనిక్. దూరంగా ఏదో గోలగా ఉంది. కంటికి అడ్డంగా ఉన్న కొమ్మలను వంచి చూసేసరికి కొంచెం దూరంలో పాల సముద్రంలో వటపత్రశాయిలా కంకరరోడ్డుకు అడ్డంగా పవ్వళించి వున్నాడు మల్లేశు జనమంతా కొత్త సినిమా చూస్తున్నట్లు మల్లేశు చుట్టూ చేరి వాడి మధుర వాక్కులు వింటున్నారు. 'తెల్లోడు తాగేరా తెలివికల్లోడయిండు! నా మాట విని తాగండ్రా' అంటున్నాడు మల్లేశు

'డబ్బులేండి తాగదెట్టరా' అన్నా డొకడు.

'అందుకే మన బతుకిట్టాత గలడింది. మన సరపంగాడు ఎలెక్సన్ ముందు యిస్తానన్న వెయ్యి ఎగ్గొట్టింది ఇందుకే' అంటూ మల్లేశు భారంగా లేచి ప్రక్క నున్నవాని గడ్డం పట్టుకొని 'మనం నాటు కొట్టి మోటు తేలుతున్నాంరా చిట్టీ. పెద్దోళ్ళు తెల్లోల్లది తాగి తెలివిమీరి పోతున్నారు. దేశా లేలుతున్నారు.' అందరు ఫక్కున నవ్వారు.

'నీకు నాటయినా ఎట్లా వచ్చిందిరా' అడిగాడొకడు. మల్లేశు పెద్దగా నవ్వాడు. 'తెలివి ఒకరి అబ్బసొమ్మా పెసలగురమ్మా' అన్నాడురా బెమ్మదేవుడు. అదుండ్లా గురివి, అంటే నా భార్య గురమ్మ జబ్బు పడి మంచంపట్టింది కదా! దాని జబ్బు నడ్డం పెట్టుకొని డబ్బుచేసుకున్నా. ఏముంది గోవిందాచారి దగ్గరకుపోతే పది రూపాయలకు మందులు రాశాడు. ధనిక్ బాబు దగ్గరకెళ్లి 'నా పెండ్లాం ప్రాణం నీ చేతుల్లో ఉంది దొరా' అన్నానంతే. ముందు లిచ్చాడు. ఐదురూపాయలకు అమ్ముకొని తృప్తిగా తాగా.'

ధనిక్ నిర్ఘాంతపోయాడు. పొద్దుట వాని బాధ చూచి తన బాధను మరచి పోయి మందు లిచ్చింది వాస్తవమే. వెధవ ఎంత పని చేశాడు! అతి మంచి తనంతోనే తాను చెడిపోతున్నాను' అను కున్నాడు ధనిక్.

'నీకు బుద్ధి లేకపోతే ఆ ధనిక్కైనా బుద్ధి లేదట్రా. నీలాంటివాడికి అప్పెట్టా పెట్టాడు' అన్నాడొకడు.

'వీడు ఏమిచేస్తే అయన కెందుకు. అయన మందులు అమ్ముడుపోతే సరి' అన్నాడు మరొకడు.

ధనిక్ గిర్రున వెనక్కు తిరిగాడు. పరుగెత్తినట్లుగా వచ్చి ఇల్లు చేరాడు. రాత్రికి భోజనంచేసి పడుకొన్నాడేగాని, నిదర పట్టలేదు. ఊరిమీద అప్పుపెట్టి నెత్తికి చేతులు రావడం తప్ప స్వార్థం, పరార్థం రెండు మిగలలేదు. అతని మెద డంతా కొలిమిలా వేడెక్కింది.

ఇంతలో మల్లేశు పరుగెత్తుకుంటూ వచ్చాడు. 'ఈ సూదిమందు పడంది నా భార్య బతకదంట బాబు' అంటూ చీటీ యిచ్చి కాళ్ళదగ్గర కూలబడ్డాడు యేడుస్తూ.

ధనిక్ వళ్ళంతా వేడిగా ఆవిరి వస్తుంది. చేతిలోని చీటీ ఆ వేడికి వాడి మాడిపోతుంది.

'ఏవేంది' అన్నాడు కర్కశంగా.

వాడు కన్నీళ్ళు తుడుచుకుంటూ లేదని చేతితోనే చెప్పాడు.

'ఒరేయి మల్లేశు. నీకంటె పశువు నయం. పొద్దున జబ్బు అంటూ పది కాజేసి సుష్ఠుగా తాగావు. ఇప్పుడు చస్తుందంటూ పాతిక కాజేయాలని వచ్చావు. నీవు చచ్చి గీపెట్టినా ఒక్క పైసా కూడా అప్పివ్వను' అన్నాడు దృఢంగా. వాడు నిస్సహాయంగా చూశాడు.'సత్తెపెమానంగా నిజం బాబూ, ఈ కష్టం కాస్తే చచ్చి నీ కడుపున పుడతా' నంటూ గోలగా యేడవడం మొదలుపెట్టాడు.

వీడు చచ్చి నిజంగా తన కడుపున పుడతాడేమోనని ధనిక్ భయపడ్డాడు. వాడి సారాయి యేడుపు వినేకొద్దీ వళ్ళంతా తేళ్ళు, జర్రులు ప్రాకినట్లు అయింది. వెధవలు తన మంచితనాన్ని అడ్డుపెట్టుకొని దోచుకుంటున్నారు అనుకొనేసరికి వెర్రి ఆవేశం వచ్చింది. ఏడుస్తున్న మల్లేశుని నానా తిట్లు తిట్టి బయటకు నెట్టికాని వదల్లేదు. మల్లేశు వెళ్ళేడుగాని మనసుకు మాత్రం స్వస్థత చిక్కలేదు.

కలత నిదురలో మెలుకవ వచ్చి ఏమీ తోచక ఊరి చివరనున్న శివాలయపు అరుగుమీదకు వచ్చి కూర్చొన్నాడు ధనిక్, దుప్పటి కప్పుకొని. ఇద్దరు మను ష్యులు ఏదో మాట్లాడుకొంటూ వస్తు న్నారు ఆ దారిన. అందులో ఒకరు గోవిందావారిలాగున్నాడు. 'ఆ ధనిక్ గుండె బండా యేమిరా? పాపం వాడు ఎంత మొత్తుకున్నా వినక మెడబట్టి బయటకు నెట్టాడట. ఆ మందు దొరికి ఉంటే పరిస్థితి ఎట్లా ఉండేదో' అన్నాడు.

ధనిక్ ఒక్క క్షణం నిర్ఘాంత పోయాడు. వెంటనె గుర్తుకు వచ్చిన వాడిలా పరుగెత్తి మరుక్షణంలో మందుల పెట్టెతోసహా మల్లేశు గుడిసెముందుకు చేరాడు.

మల్లేశు భార్య తలవైపు వెలుగు తున్న దీపంవైపు వెర్రిగా చూచి తల దించుకున్నాడు.

'నా చేతులారా నీ ప్రాణం తీసాను

గురివా!' హృదయ విదారకంగా ఏడుస్తున్న మల్లేశును ఇద్దరు పట్టుకొన్నారు.

'చచ్చి సుఖపడిందిలే' అన్నాడొకడు.

'కూలినాలి చేసి తాగడానికి డబ్బులిచ్చేది. ఇక తాగడానికి ఎట్లా అని వాడేడిశేది' అన్నాడొకడు.

'విరిగిన ఎముకే గాని విరగని ఎముక లేదు. ఇంతకు ఆ ధనిక్కాడు దీని పాలిటికి దేవుడైనాడు' అన్నాడు వేరొకడు.

ధనిక్ చేతినుండి పెట్టె ఎప్పుడు జారిందో తెలియదు. అతనికి గుర్తువచ్చే సరికి తా నలవాటుగా కూర్చునే ఇసుక తిన్నెపై వెల్లకిలా పడుకొని ఉన్నాడు.

ఆకాశం నుండి ఒక్కొక్క చినుకు పడుతోంది. ధనిక్ లేచి కూర్చున్నాడు. ఇట్లా ఎందుకు జరిగింది? ఇందులో ఎవరి బాధ్యత ఎంత? అనే ప్రశ్నలు అతని మెదడును తొలుస్తున్నాయి.

తన్ను మోసంచేసి పది కాజేసి తాగి తందనాలాడిన మల్లేశుగాడిదే తప్పంతా. అదే తప్పు పునరావృతం అవుతుందనే భ్రమతో కరుడుకట్టిన కఠిన శిలగా మారడం తనది మాత్రం తప్పుకాదూ.'

తప్పొప్పులు తెలుసుకొని పరుగెత్తే లోపలే తన్ను లోకనిందకు గురిచేసి తొందరిపడి గుటుక్కుమనడం గురమ్మది కూడ తప్పే. ఈ ఆడోళ్ళకు ప్రతిదీ తొందరే అని విసుక్కున్నాడు ధనిక్. పురుగులు పట్టిన పేడలా అతని మన సంతా ప్రశ్నోత్తరాలతో లుకలుక లాడుతోంది.

వర్షంలో తడుస్తున్నా అతని బుర్ర వేడెక్కిపోతూ ఉంది. ఇంతలో వర్షం వెలిసింది. ఆలోచనలు అంతమై అతనికొక మార్గం దొరికినట్లయింది. అతను లేచి ఎంతో ప్రశాంతంగా అడుగులు వేసుకుంటూ జగ్గారావు యింటివైపు నడిచాడు.

పొద్దున్నే చెట్టుక్రింద మందులున్న పెట్టె చూచిన మల్లేశు కళ్ళల్లో కన్నీరు మెదిలింది. కళ్ళు మూసుకొని భార్య కళేబరంపై చేయిపెట్టి ఏదో గొణిగాడు.

అంత్యక్రియల అనంతరం మందుల పెట్టె తీసుకొని దుకాణం దగ్గరకు వెళ్ళిన మల్లేశు వ్రేలాడే తాళంచూసి ఆగిపోయాడు. పక్కన విచారించగా ఆస్తి అప్పు అంతా జగ్గారావుకు అప్పజెప్పి ఆ రోజు ఉదయమే ధనిక్ ఊరువిడిచి వెళ్ళిపోయాడని తెలిపింది.

'ఈ మందులు యేమిచేయాలి? నే నిప్పుడు తాగడం కూడా మానుకొంటినే' అని గొణుక్కుంటు మల్లేశు ఇంటిదారి పట్టాడు.

—o—